క్లుప్తంగా

ఉద్యోగ బెనిఫిట్స్ ఇప్పించండి



నయీంనగర్: తన భర్త చెన్న రాజు కానిస్టేబుల్ (సీపీ నంబర్ 2250)గా పనిచేస్తూ మరణించాడని, ఈక్రమంలో మరణాంతరం వచ్చే బెనిఫిట్స్ ఇప్పించి తమను ఆదుకోవాలని మృతుడి భార్య చెన్న శ్రీదేవి విజ్ఞప్తి చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన భర్తను బంధువులే హత్య చేశారని, తాను వారిపై కేసు పెడతానంటే పోలీసులు బెదిరించి కేసు పెట్టకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తన భర్త బెనిఫిట్స్‌కు సంబంధించిన సర్టిఫికెట్లు డీపీఓలో ఇచ్చానని, అయినా తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా అధికారులు అడ్డుకుంటున్నారని వాపోయారు. తన భర్త ఉద్యోగం, పెన్షన్, బెనిఫిట్స్ ఇప్పించి తమకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు.

పేద విద్యార్థికి సైకిల్ బహూకరణ



ఖిలా వరంగల్: వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన పేద విద్యార్థి సమీన.. పదో తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియట్‌లో అడుగు పెట్టబోతోంది. ఈమేరకు విద్యార్థినికి వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే నరేందర్ సోమవారం ఆర్థిక సాయంతో పాటు సైకిల్‌ను బహూకరించారు. కార్యక్రమంలో కొంత మోహన్, కుమార్, షర్ఫొద్దీన్, సమీనా, చాంద్‌పాషా పాల్గొన్నారు.

ఆర్థికసాయం

వరంగల్: నగరంలోని కొత్తవాడకు చెందిన వడ్లూరి మధుసూదనాచారి కుమార్తె మౌనిక వివాహానికి కావాల్సిన నగదును స్థానిక జీజేఎస్ ఫౌండేషన్ అధినేత, అడ్వకేట్ వెంకటరత్నం తన తల్లిదండ్రుల పేర సోమవారం అందించారు. వివాహ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొని ఆర్థిక చేయూనందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

కేయూ క్యాంపస్: ఇండియన్ డ్రగ్ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ చైర్మన్‌గా కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి రాజమౌళి ఇటీవల ఎన్నికయ్యారు. ఈమేరకు రాజమౌళిని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం సన్మానించారు. అనంతరం గాదె సమ్మయ్య మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన రాజమౌళి.. అనేక ఆటుపోట్లు ఎదుర్కొని కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగారని కొనియాడారు. రాజమౌళి మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలకు ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రముఖ స్థానం ఉందని వివరించారు.

విద్యార్థికి కాంస్య పతకం

వరంగల్: ఏపీ అనంతపురం జిల్లా కేంద్రంలో ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్స్ టోర్నమెంట్ పోటీల్లో వరంగల్ సుందరయ్యనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రచ్చ నర్సింహ ప్రతిభ కనబరిచాడు. ఈమేరకు కాంస్య పతకం సాధించాడు. స్కూల్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో నర్సింహను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర రెడ్డి, పీఈటీ అశోక్‌బాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు



మడికొండ: డంపింగ్ యార్డ్‌తో కాజీపేట మండలంలోని మడికొండ, రాంపూర్, అయోధ్యపురం, తదితర గ్రామాల ప్రజలకు రక్షణ కరువైందని ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ అన్నారు. ఈమేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపి, అనంతరం బోర్డు అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కారణంగా చుట్టు పక్కల ప్రజలు శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్త చేశారు. అలాగే, చుట్టు పక్కల గ్రామాలైన టేకులగూడెం, అయోధ్యపురం, ధర్మసాగర్, కుమ్మరిగూడెం, తదితర గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. 2020లో సుమారు రూ.36కోట్ల వ్యయంతో బయో మైనింగ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి.. ఇప్పటివరకు పరిష్కరించలేదని విమర్శించారు.

యథేచ్ఛగా మొరం దందా

పట్టించుకోని అధికారులు



ముగ్దుంపురం గ్రామశివారులోని చెరువులో పొక్లెయినర్‌తో తవ్వుతున్న మొరం

నర్సంపేట రూరల్ : మండలంలో మొరం దందా జోరుగా సాగుతోంది. జిల్లా స్థాయి అధికారులు స్పందించి దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని ముగ్దుంపురం శివారులోని పెద్ద చెరువులో యథేచ్ఛగా మొరం దందా కొనసాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా చెరువులను బొందలగడ్డలుగా మార్చేస్తున్నారు. ఎక్కడ మంచి మొరం వస్తే అక్కడే లోతుగా తీస్తుండడంగా చెరువు ఆనవాలు లేకుండా మారుతోంది. దీంతో చెరువులోకి వర్షాకాలం నీరు వచ్చిందంటే పశువులు ఆ గుంతల్లో పడి మృత్యువాతపడే అవకాశాలునప్పటికి కనీసం ఆవైపు చూసే అధికారులే కరువయ్యారు. ముగ్దుంపురం చెరువు చెన్నారావుపేట గ్రామానికి సమీపంలో ఉండడంతో యథేచ్ఛగా చెన్నారావుపేటకు గ్రామానికి మొరం తరలిస్తున్నారు. ట్రిప్పుకు రూ.600 నుంచి రూ.1,000 చొప్పున వసూలు చేస్తున్నారు. అధికారులు వచ్చి పోలీసులకు తాత్కాలికంగా ఫోన్ చేస్తూ వారిని మళ్లీ చెరువు వైపు రాకుండా ముందుగా జాగ్రత్తలు పడుతున్నారు. దీంతో దందాకు ఎవరు అడ్డులేరన్న విధంగా సాగిస్తున్నారు. చెరువు కట్టపై నుంచి వందల ట్రిప్పుల మొరం తరలిస్తుండడంతో చెరువు కట్ట సైతం దెబ్బతింటోంది. దీంతో రైతులు పంటల సమయంలో ఆవైపు వెళ్లాలంటే నరకం తప్పే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి మొరం దందాను అడ్డుకోవాలని పలువురు కోరారు.

ఇబ్బందులు పడుతున్న అధికారులు

చెన్నారావుపేట మండలం నుంచి ఆరు గ్రామాలు నర్సంపేట మండలంలో విలీనమయ్యాయి. అయితే అన్ని శాఖలు వచ్చినప్పటికీ పోలీస్ శాఖ ఇంత వరకు చెన్నారావుపేట మండలం కిందనే ఉండడంతో ఈ దందాను అడ్డుకోవడం ఇబ్బందిగా మారింది. రెవెన్యూ పరిధి నర్సంపేట మండలం తహసీల్దార్ వెళ్లాల్సింది. పోలీస్ శాఖ చెన్నారావుపేట వైపు ఉండడంతో ఈ రెండు మండలాల అధికారుల మధ్య సమస్యలు తలెత్తడంతో తమకు సంబంధం లేదంటూ వదిలేయడంతో మొరం దందాను అడ్డుకునే వారే లేకుండాపోయారు. చెన్నారావుపేట పోలీస్‌శాఖ, నర్సంపేట రెవెన్యూ, ఐబీ, మైనింగ్ శాఖఅధికారులు స్పందించి ఈదందాను నిలిపివేయాలని పలువురు కోరుతున్నారు.

సర్టిఫికెట్ల కోసం ఎదురు చూపులు



సిబ్బందిని నిలదీస్తున్న దరఖాస్తుదారులు

దుగ్గొండి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్ల కోసం వందల సంఖ్యలో దరఖాస్తు దారులు ఎదురు చూస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన బీసీలకు రూ.లక్ష సాయం పథకంలో దరఖాస్తు చేసుకోవడానికి అధిక సంఖ్యలో కులవృత్తిదారులు సైతం కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేక పోవడంతో వందల సంఖ్యలో దరఖాస్తులు పేరుకుపోయాయి. దీంతో వారంతా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో గొడవకు దిగారు. అయితే గిర్దావర్, నాయబ్ తహసీల్దార్‌లు విధులకు హాజరు కాకపోగా తహసీల్దార్ సంపత్ ఆలస్యంగా హాజరయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో సర్టిఫికెట్లు అందించాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

బాలల రక్షణకు పాటుపడాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్

నర్సంపేట : బాలల రక్షణకు పాటు పడాలని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతీ ఒక్కరు కృషి చేయాలని స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బిజ్జంకి ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్, చైల్డ్ లైన్–1098ల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని విజ్‌డమ్ పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించగా కరస్పాండెంట్ జహంగీర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించగా ప్రభాకర్ మాట్లాడారు. బాల కార్మిక రహిత నూతన సమాజం కోసం పాటు పడాలని తెలిపారు. బడి బయటి పిల్లలందరూ బాల కార్మికులేనని అన్నారు. ఇటుక బట్టీ, మిల్లుల్లో బాల కార్మికులుగా బాల్యాన్ని కోల్పోతున్న బాలల బతుకులకు అండగా నిలుద్దామని తెలిపారు. 18సంవత్సరాలలోపు బాలబాలికలచే పని చేయించడం బాల కార్మిక నిషేధ చట్టం–1986ప్రకారం నేరం అని, అలా చేస్తే యజమానులకు శిక్షలు, జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు. బాల కార్మికులు ఎక్కడ కనిపించినా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్–1098కు ఉచిత కాల్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాశ్, ఉపాధ్యాయులు వీరభద్రయ్య, రియాజ్, ప్రశాంత్, కుమారస్వామి, ఇలియాస్, రవీందర్, సుకన్య, అరుణ, ఫర్జానా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నెక్కొండ: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య లభిస్తోందని మండల నోడల ఆఫీసర్, గురిజాల జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గుడిపూడి రాంచందర్‌రావు అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఏక రూప దుస్తువులు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోని చదువుల్లో రాణించాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

నెక్కొండ : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు బూర్గుపల్లి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అప్పల్‌రావుపేట గ్రామంలో సోమవారం హైస్కూల్ ఉపాధ్యాయులు బడి బాట చేపట్టారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డె రజిత, ఉపాధ్యాయులు యాకయ్య, భూలక్ష్మి, శ్యాంసుందర్, గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం : మండల కేంద్రంలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూ.30లక్షలతో నిర్మిస్తున్న నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకోని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సర్కార్ పాఠశాలల కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి ఆధునీకరించడం జరుగుతుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలన్నారు. దాసరి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



మంజ్యా (ఫైల్)

ఖానాపురం : మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అశోక్‌నగర్‌లో డీప్లోరైడ్ ప్రాజెక్ట్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని ఎస్వీ కాలనీకి చెందిన మాలోత్ మంజ్య(58) కొంత కాలంగా మతిస్థిమితం లేక ఇబ్బందిపడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న ఇంటి నుంచి అశోక్‌నగర్‌కు చేరుకున్నాడు. 9న పంట పొలాల వైపు వెళ్తు ఎండవేడిమికి తట్టుకోలేక చిన్న కాల్వలో పడిపోయాడు. సమీపంలోని ప్రజలు చూసినప్పటికి ఎవరో తెలియకపోవడంతో వదిలేశారు. దీంతో మంజ్య అక్కడే మృతి చెందాడు. ఈ క్రమంలో సోమవారం అటువైపుగా వెళ్లిన స్థానికులు కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతని జేబులో ఉన్న విజిటింగ్ కార్డు ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కుమారుడు వచ్చి తన తండ్రిగానే గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేటకు తరలించారు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పనిచేయని వాటర్ ప్లాంట్



పనిచేయని అక్కల్‌చెడ వాటర్ ప్లాంట్

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ గతంలో పని చేయలేదు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో ప్రారంభించి మళ్లీ నిలిపివేశారు. రోజు వాటర్ ప్లాంట్ తెరిచి ఉంచుతారు.. కానీ వాటర్ పోయరు. ఇది ఏంటని గ్రామస్తులు అడిగితే సమాధానం చెప్పడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా వేలంలో పెట్టి గ్రామస్తులకు శుద్ధీకరణ నీటిని అందిస్తామన్నారు.

ఓటరు జాబితా సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రాము

దామెర : ఓటరు జాబితా సవరణ సక్రమంగా నిర్వహించాలని పరకాల ఆర్డీఓ రాము సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బీఎల్‌ఓలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఓటరు జాబితాను ఇంటింటికి తిరిగి పరిశీలించాలని అన్నారు. ఓటరు మణించినట్లయితే ధ్రువీకరణ పత్రంతో పాటు ఫారం–7ను జతపరిచి కుటుంబ సభ్యుల ధ్రువీకరణ తీసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన నూతన ఓటర్లను గుర్తించి నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసే క్రమంలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని వెల్లడించారు. తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, ఆర్‌ఐ భాస్కర్ రెడ్డి, ఏఎస్‌ఓ హైమావతి బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌లను చేర్చకపోవడం సరికాదు'

రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రూ.లక్ష ఆర్థికసాయం పరిధిలో ముదిరాజ్ కులస్తులను చేర్చకపోవడం సరికాదని మెపా మండల అధ్యక్షుడు సోడెపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని గత ప్రభుత్వాలు చేసిన ప్రకటన సుప్రీంకోర్టులో కూడా విచారణ చేపట్టి అసెంబ్లీకి తీర్మానం పంపించారని గుర్తుచేశారు. ఆ తీర్మానాన్ని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రస్తావించకుండా తాత్సారం చేస్తూ ముదిరాజ్‌లను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ముదిరాజ్‌ల పట్ల చిత్తశుద్ధి ఉంటే కులవృత్తుల్లో చేరుస్తూ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కొమ్ము ప్రభాకర్, మండల ముఖ్య కార్యదర్శి కనుకుంట్ల సతీష్ తదితరులు ఉన్నారు.

స్థల పరిశీలన

పర్వతగిరి : మండలంలోని కల్లెడ, బూరుగుమడ్ల గ్రామాల మధ్యలోని భైరవుని గుట్టపై అతిపెద్ద ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ఆర్‌డీఎఫ్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు సోమవారం గ్రామస్తులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావుకు గ్రామస్తులు గుట్ట ప్రాముఖ్యతను వివరించారు.

నేటినుంచి యోగా శిబిరం

చెన్నారావుపేట : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని యోగా ఆచార్యులు ములుక ఐలయ్య పిలుపునిచ్చారు. నేటి నుంచి 21వరకు ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి 6గంటల వరకు స్థానిక జాగృతి హైస్కూల్ ఆవరణలో యోగా తరగతులు ఉంటాయన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

నర్సంపేట రూరల్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం వరంగల్‌లోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన కవిసమ్మేళనం కార్యక్రమంలో నర్సంపేట మండలంలోని గురిజాల జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన హిందీ పండితుడు మహ్మద్ ముజీబ్ రహమాన్ కలెక్టర్ చేతుల మీదుగా మెమొంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. సోమవారం ఉదయం గురిజాల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, నోడల్ ఆఫీసర్ గుడిపూడి రాంచందర్‌రావు,ఉపాధ్యాయులు అభినందించారు.

జీపీకి గేదెల అప్పగింత

చెన్నారావుపేట : మండలంలోని బాపునగర్ గ్రామానికి 15 రోజుల క్రితం తన గేదెల వెంట తప్పిపోయి ఏడు గేదెలు వచ్చినట్లు స్థానిక రైతు బాదావత్ భాస్కర్ సోమవారం తెలిపారు. కూలి మనిషితో మేపుతున్నానని అన్నాడు. ఇప్పటి వరకు ఎవరు కూడా గేదెల కోసం రాలేదని, గ్రామ పంచాయతీకి అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. గేదెలు పోయినవారు బాపునగర్ సర్పంచ్‌ని సంప్రదించాలని కోరారు.

చెట్టుకొమ్మలు పడి వ్యక్తికి గాయాలు

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన కుక్కల శ్రీను తన ఇంటి ఎదుట కూర్చుని ఉండగా సోమవారం సాయంత్రం గాలిదుమారంతో రాగా వేప చెట్టు కొమ్మలు విరిగి పడడంతో శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఆస్పత్రికి తరలించారు.

మండల సభ వాయిదా

నల్లబెల్లి : మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ కుమార్ సోమవారం ప్రకటించారు. సమావేశానికి 11మంది సభ్యులకు గాను ఎంపీపీ ఊడుగుల సునీత, వైస్ ఎంపీపీ గందె శ్రీలత, నల్లబెల్లి ఎంపీటీసీ జన్ను జయరావులు మాత్రమే హాజరయ్యారు. ఏఈ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీరాణి ఉన్నారు.

పరామర్శ

ఐనవోలు : మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన ఉల్లెంగుల సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిగింటి శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లేంగుల యాదగిరి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట తెలంగాణ రజక రిజర్వేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపి, రజక ఉద్యమ నేత మడల్ వీరన్న, రాములు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



పర్వతగిరి : రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని దివ్యాంగులకు రూ. 3,016 నుంచి రూ.4,016లను పెంచడంపై పర్వతగిరి గ్రామ పంచాయతీ ఆవరణలో దివ్యాంగుల మండల అధ్యక్షుడు బర్ల బాబు, గోరుగుట్ట తండా సర్పంచ్ బానోత్ వెంకన్న, జిల్లా అధ్యక్షుడు రవీందర్, వెంకన్న , కుమరస్వామిల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నరేండ్ల రాజు, శ్రీనివాస్, వీరస్వామి, బాబు, పర్వతగిరి సర్పంచ్ చింతపట్ల మాలతి, సోమేశ్వర్‌రావు, ఎంపీటీసీ మాడుగుల రాజు, ఉప సర్పంచ్ జనార్దన్, పార్టీ మండల అధ్యక్షుడు రంగుకుమార్, తిరుపతి, కిష్టయ్య, కొమురయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.

తండాలో తాగునీటికి తండ్లాట



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

వర్ధన్నపేట : మున్సిపాలిటీ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించామని ఓ వైపు నేతలు చెబుతుంటే వర్ధన్నపేట పట్టణ పరిధిలోని తాళ్లకుంట తండాలో నీళ్ల గోసతో గిరిజనులు కిలోమీటరు దూరం వెళ్లి వ్యవసాయ బావుల నుంచి నీళ్ల తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలో డీసీ తండా గ్రామ పంచాయతీని విలీనం చేశారు. డీసీ తండా పరిధిలోని తాళ్లకుంట తండాలో మిషన్ భగీరథ కింద నీళ్ల ట్యాంక్ నిర్మించారు. ట్యాంక్ నిర్మాణం సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ ట్యాంక్ నిర్మాణానికి పక్కనే ఉన్న గిరిజన రైతు వద్ద నుంచి నీటిని వినియోగించుకుని నిర్మాణం పూర్తి చేశాడు. గిరిజన రైతుకు నీటి వాడకం కింద డబ్బులు ఇస్తానని తీరా డబ్బులు వాటిని ఇవ్వకుండా పోయాడు. దీంతో ఆ రైతు ట్యాంక్‌లో నింపుతున్న మిషన్‌భగీరథ నీటిని సరఫరా కాకుండా వృథాగా ఎస్సారెస్పీ కాల్వలోకి వదులుతున్నాడు. అలాగే తనకు వచ్చే డబ్బులు ఇచ్చేవరకు నీటిని వాడుకోవద్దని మొండి కేయడంతో గిరిజనులు చేసేదేమి లేక వ్యవసాయ బావుల వద్ద నుంచి నీటిని తీసుకువస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు మాత్రం ఈ విషయంపై చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ తండాకు నీటి సరఫరా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న బాధ్యులు

చెన్నారావుపేట : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారులోని కట్టయ్యపల్లికి చెందిన జిడ్డి సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు 50 కిలోల బియ్యం అందించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన పర్కాల రాజు ఇటీవల వడదెబ్బతో మృతి చెందగా బాధిత కటుంబానికి జై భీమ్, బీఎస్‌పీ, జయ ఆర్‌ఎస్‌పీ, జై భారత్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట'లో విద్యార్థులు చేరలేదు

- ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- బోసిపోయిన పాఠశాలలు



రేవతండాలో విద్యార్థులు లేక పాఠశాలలో వేచిచూస్తున్న ఉపాధ్యాయుడు

ఖానాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉంటారు.. నాణ్యమైన విద్యాబోధనలు సైతం అందుతాయి.. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చెబుతూ ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు చెబుతున్న మాటలివి.. కానీ ఉపాధ్యాయుల మాటలకు ఆ గ్రామాల్లో ప్రజలు పట్టించుకోవడంలేదు.. అడపాదడపా ప్రచారాలు చేసి వదిలేస్తుండటంతో ప్రజలు సైతం ఆసక్తి చూపడంలేదు.. మండలంలోని వేపచెట్టుతండా, రేవతండా, గంగగూడెంతండా, కొడ్తిమాటుతండాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల ఉపాధ్యాయులు జయశంకర్ బడిబాట నిర్వహించారు. ఇందులో భాగంగానే తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. అయినా విద్యార్థుల తల్లిదండ్రుల మనసు మాత్రం కరగలేదు. దీంతో ఒక్క విద్యార్థి కూడా ఈ పాఠశాలల్లో చేరకపోవడంతో ఓపెనింగ్ తొలిరోజు బోసిబోయి కనిపించాయి. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మాత్రం పాఠశాలలకు వచ్చి విధులు నిర్వహించారు. విద్యార్థులు చేరకపోవడంతో పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు మూతబడిపోతున్నాయి. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఉపాధ్యాయులు బడిబాటలో ముమ్మర ప్రచారం చేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరే అవకాశం ఉంటుంది. మండల కేంద్రంలోని కోయవాడలోని పాఠశాలలోనూ ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉండటంలో వారితోనే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు.